సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
97053 47483
నంబర్‌ను సంప్రదించండి

స్వాతంత్య్ర వేడుకలకు ఏర్పాట్లు పూర్తి


ఆరిలోవలో షాపుల వద్ద విక్రయిస్తున్న జాతీయ జెండాలు

ఆరిలోవ: స్వాతంత్య్ర వేడుకలకు తూర్పు నియోజకవర్గం సిద్ధమైంది. జాతీయ జెండాలతో ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలలు కళకళలాడుతున్నాయి. జిల్లా విద్యాశాఖ కార్యాలయం, రూరల్ రెవెన్యూ కార్యాలయం, విశాఖ వేలీ స్కూల్, జూ పార్కు, జిల్లా పశు సంవర్థక శాఖ కార్యాలయం, విమ్స్, విశాఖ కేంద్ర కారాగారం, జిల్లా మహిళా ప్రాంగణం, విశాలాక్షినగర్‌లో కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ పరేడ్ మైదానం, తోటగరువులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెదవాల్తేరులో కొటక్ హైస్కూల్, ఏయూ ఉన్నత పాఠశాల, ఎంవీపీ కాలనీలో టాస్క్‌ఫోర్స్ పోలీస్ స్టేషన్, ఆరిలోవ, ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్లు, మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌తో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు స్వాతంత్య్ర వేడుకలకు సిద్ధమయ్యాయి.


ముస్తాబైన మానసిక ఆస్పత్రి భవనం

త్రివర్ణ వెలుగుల్లో మానసిక ఆస్పత్రి

జోరుగా జెండాల విక్రయాలు

జాతీయ జెండాల విక్రయాలు సోమవారం జోరుగా సాగాయి. సాయంత్రం పాఠశాలల నుంచి వచ్చిన చిన్నారులు షాపుల వద్దకు వెళ్లి జెండాలు కొనుగోలు చేశారు. 'ఐ లవ్ ఇండియా' పేరుతో రాసిన జెండాలను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపారు. జాతీయ జెండాలతో పాటు మూడు రంగులతో కూడిన తోరణాలను షాపుల వద్ద వేలాడదీశారు. మూడు రంగులతో ఉన్న బెలూన్స్, చేతి బ్యాండ్‌ల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. వివిధ రకాల చాక్లెట్లు సైతం అందుబాటులో ఉన్నాయి. ప్లాస్టిక్‌తో తయారు చేసిన జెండాల విక్రయాలు జరగకుండా అధికారులు చర్యలు చేపట్టారు.

ఏయూ క్యాంపస్: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పెదవాల్తేరులోని ప్రభుత్వ మానసిక ఆస్పత్రి భవనాన్ని మూడు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రత్యేకంగా కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగుల ఎల్‌ఈడీ దీపాలతో సుందరంగా ముస్తాబు చేశారు. సాయంత్రం వేళ ఆస్పత్రి ప్రధాన భవనం విద్యుత్ దీప కాంతులతో శోభాయమానంగా దర్శనమిస్తోంది.

మద్దిలపాలెం : హెచ్‌బీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వాతంత్య్ర వేడుకలు నిర్వహించారు. స్వాతంత్య్ర సమరయోధుల చిత్ర పటాలను ఏర్పాటు చేసి వారి చేసిన త్యాగాలను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. సంప్రదాయ వస్త్రధారణ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. స్వాతంత్య్ర వేడుకలకు వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు ముస్తాబయ్యాయి. జిల్లా మలేరియా కార్యాలయాన్ని త్రివర్ణ రంగుల జెండాలతో అలంకరించారు. మద్దిలపాలెం కృష్ణా కళాశాల రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం కూడా వేడుకలకు ముస్తాబైంది.

రేపు చలో ఆర్‌ఎం కార్యాలయం

మద్దిలపాలెం : ఆర్టీసీ స్టీల్ డిపో అధికారులు అవలంబిస్తున్న నిరంకుశ వైఖరికి నిరసనగా బుధవారం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్(ఎన్ఎంయూఏ) ఆధ్వర్యంలో చలో రీజనల్ మేనేజర్ కార్యాలయం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎన్ఎంయూఏ రీజనల్ కార్యదర్శి నీలకంఠం ఒక ప్రకటనలో తెలిపారు. స్టీల్ సిటీ డిపో అపరిష్కృత సమస్యల పరిష్కారం కోరుతూ 33 రోజులుగా ఉద్యోగులు రిలే దీక్షలు చేస్తున్నారని పేర్కొన్నారు. కార్మికులు, ఉద్యోగులు ఆ రోజు మధ్యాహ్నం 3 గంటలకు ద్వారకానగర్‌లోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఉన్న ఆర్‌ఎం కార్యాలయానికి తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

క్లుప్తంగా

విమ్స్‌కు రోగుల తాకిడి


విమ్స్ ఓపీ వద్ద రోగులు, వారి బంధువులు

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)కు సోమవారం రోగుల తాకిడి ఎక్కువైంది. రోగులు, వారిని తీసుకొచ్చిన బంధువులతో ఓపీ వద్ద రద్దీగా మారింది. డాక్టర్ల కన్సల్టెన్సీల గదులు కూడా రోగులతో కిటకిటలాడాయి. ఆర్థోపెడిక్, ఆప్తమాలజీ, జనరల్, పిడియాట్రిక్స్‌తో పాటు జ్వరాలతో బాధపడుతున్న వారి సంఖ్య ఎక్కువగా ఓపీలో నమోదైంది. సాధారణంగా అన్ని రోజులు కంటే ప్రతి సోమవారం ఓపీ ఎక్కువగా నమోదవుతుంది. ఈ వారం మాత్రం మరింత ఓపీ పెరిగింది. రోజూ 300 నుంచి 350 వరకు ఓపీ నమోదవుతోంది. తాజాగా 500కు పైగా ఓపీ నమోదైనట్లు వైద్యులు తెలిపారు.

భూగర్భ డ్రైనేజీకి మరమ్మతులు


లక్ష్మీనగర్‌లో భూగర్భ డ్రైనేజీ పైపులైన్‌కు మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

మద్దిలపాలెం : లక్ష్మీనగర్ కాలనీలో పాడైన భూగర్భ డ్రైనేజీ పైపులైన్‌కు మరమ్మతులు చేపడుతున్నారు. ఇటీవల పైపులైన్ పాడైపోవడంతో లక్ష్మీనగర్ కాలనీలో మురుగునీరు రోడ్డెక్కింది. దీంతో కాలనీ వాసులు భూగర్భ డ్రైనేజీ విభాగానికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రెండు రోజుల నుంచి సిబ్బంది భూగర్భ డ్రైనేజీ పైపులైన్‌ను కొత్తగా ఏర్పాటు చేస్తున్నారు. దీంతో శివాజీపాలెం నుంచి లక్ష్మీనగర్ కాలనీ వెళ్లే మార్గంలో రాకపోకలకు అంతరాయం కలిగింది. పనులు పూర్తయ్యే వరకూ కాలనీ వాసులు సహకరించాలని యూజీడీ అధికారులు కోరారు.

సీపీఐ ప్రచార జాత పోస్టర్ ఆవిష్కరణ


ఆరిలోవలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

ఆరిలోవ: రాష్ట్రాన్ని రక్షించండి, దేశాన్ని కాపాడండి అనే నినాదాంతో ఈ నెల 17 నుంచి సీపీఐ ఆధ్వర్యంలో ప్రచార జాతా-బస్సు యాత్ర జరగనుంది. ఈ మేరకు పోస్టర్‌ను సోమవారం ఆరిలోవలో ఆ పార్టీ నాయకులు ఆవిష్కంచారు. విశాఖలో జరిగే ప్రారంభం సభకు నగర ప్రజలు తరలిరావాలని సీపీఐ తూర్పు నియోజకవర్గ కార్యదర్శి రెహమాన్ కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కె.లక్ష్మణరావు, ఎ.దేవుడమ్మ, కాసుబాబు, తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్ ఆత్మహత్యాయత్నం

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో రౌడీషీట్ ఉన్న వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. బర్మాక్యాంప్ తిక్కవానిపాలెంలో నివసిస్తున్న వంకా కుమార్ ఆదివారం రాత్రి ఆత్మహత్యకు యత్నించాడు. ఇతడికి వివాహేతర సంబంధం ఉండటంతో భార్యతో విభేదాలు తలెత్తాయి. దీంతో ఆమె పుట్టింటికి వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకోగా.. భార్యను ఆపే ప్రయత్నం చేసినా ఒప్పుకోకపోవడంతో గదిలోకి వెళ్లి ప్లాస్టిక్ తాడుతో ఉరి వేసుకోవడానికి ప్రయత్నించాడు. ఈ క్రమంలో కుమార్ భార్య, చుట్టుపక్కల ఉన్న వారు చూసి స్పందించడంతో అతడిని సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం కుమార్ పరిస్థితి నిలకడగా ఉంది. ఆ ప్రాంతానికి చెందిన మహిళా పోలీస్ ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.సాయి నేతృత్వంలో ఎస్ఐ షేక్ సమీర్ కేసు దర్యాప్తు చేపట్టారు.

'పార్టిషన్ డే'పై ఫొటో ఎగ్జిబిషన్


నాటి ఫొటోలను తిలకిస్తున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్, అధికారులు

తాటిచెట్లపాలెం: దేశ స్వాతంత్య్రానికి ముందు రోజు జరిగిన విభజన భయానక దృశ్యాలను గుర్తుచేస్తూ వాల్తేర్ డివిజన్‌లో సోమవారం పార్టిషన్ హారర్స్ రిమెంబరెన్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి ఫొటోలతో కూడిన ఎగ్జిబిషన్‌ను రైల్వేస్టేషన్ ఫొటో గ్యాలరీ వద్ద సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ రంజన్ మహంతి నేతృత్వంలో ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్‌ను డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ ప్రారంభించి, తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్రానికి ముందు రోజు భారతీయులు ఎంతో శ్రమ, కష్టాలను అనుభవించారన్నారు. విభజన కారణంగా సుమారు 2 లక్షల మంది ప్రజలు నిరాశ్రయులయ్యారని గుర్తుచేశారు. నాటి అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు.

సీఎం జగన్‌తో మర్యాద పూర్వక భేటీ


ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో అక్కరమాని దంపతులు

ఎంవీపీ కాలనీ: వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల దంపతులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సోమ వారం తాడేపల్లిలోని నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. సీఎంకు తూర్పు నియోజకవర్గానికి చెందిన పలు అంశాలతో సమస్యలు తెలియజేసి, వినతిపత్రం అందజేశారు.

మినీ కన్వెన్షన్ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన


శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న అక్కరమాని, తదితరులు

ఎంవీపీ కాలనీ: స్థానిక సెక్టార్-1లో మినీ కన్వెన్షన్ హాల్ నిర్మాణానికి వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల సోమవారం శంకుస్థాపన చేశారు. వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో రూ.415 లక్షల వ్యయంతో నాలుగు అంతస్తుల్లో ఈ కన్వెన్షన్ హాల్‌ను నిర్మించనున్నారు. తూర్పు నియోజకవర్గ ప్రజల అవసరాలకు అనుగుణంగా ఈ కన్వెన్షన్ హాల్‌ను నిర్మించనున్నట్టు అక్కరమాని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ చీఫ్ ఇంజినీర్ ప్రసాదరాజు, కార్యనిర్వాహక ఇంజినీర్ ఎస్‌వీఎస్‌ఎన్ రాజు , ఉప కార్య నిర్వాహక ఇంజినీర్ బొట్ట శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శ్రావణ సంగీతోత్సవాలు


భక్తిగీతాలు ఆలపిస్తున్న చిన్నారులు


నృత్య ప్రదర్శనతో ఆకట్టుకుంటున్న చిన్నారులు

ఎంవీపీ కాలనీ: స్థానిక టీటీడీ కల్యాణ మండపం వేదికగా విశాఖ సాగరతీర శ్రీవారి కార్తీక దీపోత్సవ కమిటీ, వైదిక విజ్ఞాన విపంచి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీవేంకటేశ్వరస్వామి శ్రావణ సంగీతోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. శ్రీసరస్వతి మ్యూజిక్ అకాడమీ విద్యార్థులు వీణా వాయిద్యంతో చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. మీనాక్షి డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. ఈ సందర్భంగా కార్తీక దీపోత్సవ కమిటీ ప్రతినిధి హిమాంశు ప్రసాద్ మాట్లాడుతూ మంగళవారం స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు జాతీయ గీతాలాపన ఉంటుందన్నారు. అనంతరం స్వాతంత్య్ర దినోత్సవం ప్రాముఖ్యతపై వ్యాస రచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తామన్నారు.

దంతేశ్వర్‌కు అభినందనలు


దంతేశ్వర్‌ను సత్కరిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల నాయకులు

ఎంవీపీ కాలనీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం నుంచి ఇటీవల డాక్టరేట్ పొందిన దంతేశ్వర్ పట్నాయక్‌కు నగర ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల నాయకులు అభినందనలు తెలియజేశారు. వర్సిటీతో పాటు నగరానికి చెందిన ఆయా సంఘాల నాయకులు సోమవారం లాసన్స్ బే కాలనీలో జరిగిన కార్యక్రమంలో ఆయనను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏయూ పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి ఆచార్య వీర్రాజు, డాక్టర్ హరీష్‌బాబు, ఉత్తరాంధ్ర విద్యార్థి సేన అధ్యక్షుడు సుంకర రమణమూర్తి, బీసీ సంఘం రాష్ట్ర కన్వీనర్ పితాని ప్రసాద్, డాక్టర్ దేవానందం, డాక్టర్ ఆనంద్ పాల్గొన్నారు.

అందరి కృషితో కాలుష్య నియంత్రణ


ఆటోలో కార్యాలయానికి చేరుకున్న మేయర్ గొలగాని హరివెంకటకుమారి


తన బంగ్లా నుంచి సైకిల్‌పై కార్యాలయానికి వస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: కాలుష్య నియంత్రణ అందరి సామాజిక బాధ్యతని మేయర్ గొలగాని హరివెంకటకుమారి పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా మేయర్ సోమవారం తమ సొంత వాహనం వదలి క్యాంప్ ఆఫీస్ నుంచి ఆటోలో ప్రయాణించి జీవీఎంసీ కార్యాలయానికి చేరుకున్నారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తన బంగ్లా నుంచి సైకిల్‌పై కార్యాలయానికి వచ్చారు. అనంతరం జీవీఎంసీలో నిర్వహించిన డయల్ యువర్ మేయర్, జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో వాయు, శబ్ద కాలుష్యం పెరిగిపోయిందని, వాటి నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. నగరంలో ప్రైవేట్, ప్రభుత్వ సంస్థల యాజమాన్యాలు వారంలో ఒక్క రోజు ప్రజా రవాణాను వారి సిబ్బందితో ఉపయోగించేలా చూడాలన్నారు. సాధ్యమైనంత వరకు విద్యుత్ వాహనాలు ఉపయోగించాలని మేయర్, కమిషనర్ సూచించారు.

పోలీసుల అదుపులో దాడి చేసిన వ్యక్తి

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వేణుకుమార్ అనే వ్యక్తిపై జరిగిన దాడి కేసులో ఒక వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ నెల 12న వేణుకుమార్ ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ వెనుక రోడ్డులో నడుచుకుంటూ వస్తున్న సమయంలో వెనుక నుంచి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు అతడి తలపై గాయపరిచి గెడ్డలో పడేసిన విషయం తెలిసిందే. పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేసి ఒకరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

సీతమ్మధార: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్టు ఫోర్త్ టౌన్ పోలీసులు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. తాటిచెట్లపాలెం సోనియాగాంధీ నగర్‌లో నివసిస్తున్న మెరంగి కనకరత్నం(55) ఆదివారం ఇంటి నుంచి నరసింహనగర్ రైతుబజార్‌కు వెళ్లడానికి రోడ్డు దాటుతుండగా కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఆమెను చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు.

దిగొచ్చిన అల్లం ధర

సీతమ్మధార: అల్లం ధర దిగొచ్చింది. రైతుబజార్‌లోనే కిలో అల్లం రూ.200 ఉండగా.. బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.250 వరకు విక్రయించేవారు. సోమవారం నాటికి కిలో రూ.130కు దిగివచ్చింది. దీంతో వినియోగదారులు, వ్యాపారులు, తోపుడు బళ్లు, హోటళ్ల వారు అల్లం కోసం క్యూ కడుతున్నారు. ధర తగ్గడంతో వినియోగదారులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

చెత్త తరలింపులో అలసత్వం!


ఉమానగర్‌లో 4 అడుగుల రోడ్డులో యూజీడీ నుంచి తీసిన చెత్త

మద్దిలపాలెం: స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా పారిశుధ్యం మెరుగుకు ప్రజలు సహకరించాలని మేయర్ గొలగాని హరివెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ పిలుపునిస్తున్నారు. అయితే క్షేత్ర స్థాయిలో ఇందుకు విరుద్ధంగా సిబ్బంది వ్యవహరిస్తున్నారు. జీవీఎంసీ 15వ వార్డు పరిధి ఉమానగర్ ప్రాంతంలో 20 రోజులుగా యూజీడీ పొంగిపొర్లుతోంది. యూజీడీ సిబ్బంది వచ్చి యుజీడీలోని చెత్తను బయటకు తీసి 4 అడుగుల రోడ్డులో మూడు చోట్ల కుప్పలుగా వేశారు. దీంతో రాకపోకలకు ఇబ్బందవుతోంది. అప్పటి నుంచి చెత్తను తరలించాలని స్థానికులు యూజీడీ సిబ్బందికి, పారిశుధ్య కార్మికులకు విన్నవించుకుంటున్నా ఫలితం లేకుండాపోయింది. వారి మధ్య సమన్వయ లోపం ప్రజలకు శాపంగా మారింది. అది మా పనికాదు, యూజీడీ వారే తీస్తారు అంటూ తప్పించుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని యూజీడీ సిబ్బందిని అడిగితే తమకు తగినంత మంది సిబ్బంది లేరని, ఎలాగోలా పారిశుధ్య కార్మికులతో పని చేయించుకోవాలని ఉచిత సలహాలిస్తున్నారు. దీంతో దుర్వాసన భరించలేక ముక్కు మూసుకుంటూ తిరగాల్సిన పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఏఎంసీ శతాబ్ది ఉత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ

మహారాణిపేట: ఆంధ్ర వైద్య కళాశాల(ఏఎంసీ) శతాబ్ది ఉత్సవాల బ్రోచర్‌ను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజిని ఆవిష్కరించారు. సోమవారం కేజీహెచ్ ప్రధాన ద్వారం ప్రారంభం అనంతరం ఈ బ్రోచర్‌ను విడుదల చేశారు. శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని రూ.50 కోట్లతో సెంటనరీ బ్లాక్ నిర్మిస్తున్నారు. అక్టోబర్ 23 నుంచి మూడు రోజుల పాటు ఏఎంసీ శతాబ్ది ఉత్సవాలు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. కార్యక్రమంలో విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, రిటైర్డ్ డీఎంఈ డాక్టర్ టి.రవిరాజ్, టి.రాధ, ఏడీ శ్రీనివాస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

















